imma™

**Andhra Bhoomi**

**States's Financial condition - satisfactor**

**Date: 01-11-2010 | Edition: Hyderabad | Page: 2 | Source: Bureau | Clip size (cm): W: 17 H: 17**

**Clip: 1 of 1**

# రాష్ట్ర ఆర్థిక పరిస్థితి సంతృప్తికరం

## మహానుభావుడు మన్మోహన్

### సంక్షోభం బారినుంచి దేశాన్ని కాపాడింది ఆయనే

### ఆర్థిక భారత్ పుస్తకావిష్కరణలో రోశయ్య



ఆర్థిక భారత్ పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ముఖ్యమంత్రి రోశయ్య

**ఆంధ్రభూమి బ్యూరో**

హైదరాబాద్, అక్టోబర్ 31: రాష్ట్ర ఆర్థిక పరిస్థితి సంతృప్తిగా ఉందని ముఖ్యమంత్రి కె. రోశయ్య అన్నారు. ఆర్థిక పరిస్థితి సంతృప్తిగా ఉందని చెప్పే సూచికలు తనకు కనపడుతున్నాయని ఆయన అన్నారు. ఆదివారం ఇక్కడ ఆయన ప్రముఖ బ్యాంకింగ్ నిపుణుడు, చార్టెర్డ్ అకౌంటెంట్ కె. నరసింహమూర్తి రాసిన 'ఆర్థిక భారత్' అనే పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ రెండేళ్లక్రితం భారతదేశం కూడా ఆర్థిక సంక్షోభాన్ని అనూహ్యరీతిలో ఎదుర్కొందని, కాని ఈ ఊబిలో చిక్కుకోకుండా ప్రధాని మన్మోహన్ సింగ్ రక్షించారని అన్నారు. తామేదో ఆర్థిక విధానాలను రూపొందిస్తున్నామని ప్రజాప్రతినిధులు భుజాలు ఎగురవేస్తుంటారని, వాస్తవానికి ఆర్థిక సంక్షోభం నుంచి తప్పించేది నరసింహమూర్తి లాంటి ఆర్థిక రంగ నిపుణులేనన్నారు. తాను బడ్జెట్‌పై కసరత్తులో భాగంగా ప్రభుత్వ ఉన్నతాధికారులతో మాట్లాడిన తర్వాత నరసింహమూర్తితో కూడా సంప్రదించి అవసరమైన సలహాలు తీసుకుంటున్నానన్నారు. నరసింహమూర్తి లాంటి ఆర్థిక రంగ నిపుణుల సలహాలు రాష్ట్రానికి అవసరమని ఆయన అన్నారు. కేంద్ర మానవవనరుల శాఖ సహాయ మంత్రి డి. పురేంధేశ్వరి మాట్లాడుతూ 20 సంవత్సరాలక్రితం భారత్ ఇప్పుడున్న విధంగా శరవేగంగా అభివృద్ధి చెందుతుందని ఎవరూ ఊహించలేదన్నారు. ఆర్థికాభివృద్ధిరేటును 5.5 శాతం నుంచి 9 శాతం వరకు తీసుకువచ్చిన ఘనత గతంలో ఆర్థిక శాఖ మంత్రిగా పనిచేసిన మన్మోహన్ సింగ్, అప్పటి ప్రధాని పివి నరసింహారావుకు దక్కుతుందన్నారు. పేకమేడల్లా భారత్ ఆర్థిక రంగం కూలిపోకుండా ఆదుకున్న ఘనత ఈ ఇద్దరు మహానేతలకు దక్కుతుందన్నారు. ప్రపంచంలో భారత్ ఐదవ అతిపెద్ద ఆర్థిక శక్తిగా అవతరించిందన్నారు. భారత్‌లో ప్రస్తుతం తలసరి ఆదాయం 2900 డాలర్లకు చేరిందన్నారు. పుస్తక రచయిత, బ్యాంకింగ్ రంగ నిపుణుడు కె. నరసింహమూర్తి మాట్లాడుతూ భారతదేశంలో పనిచేసే సంస్కృతి పెరగాలని, సబ్సిడీలు కేవలం అర్హులైన వర్గానికి ఇవ్వాలని, ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలులో లోపాలకు తావులేకుండా ఉండాలని, ప్రజల్లో పొదుపు సంస్కృతి పెరగాలని, అప్పుడే భారత్ ఆర్థిక రంగం కళకళలాడుతుంటుందన్నారు. అమెరికా ఆర్థిక మాంద్యం నుంచి కోలుకున్నా, ఇంకా జిడిపి రేటు పెరగలేదని, ఇంగ్లాండ్, ఫ్రాన్స్ తదితర దేశాలు సంక్షోభంతో విలవిలలాడుతున్నాయన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో పనిచేసే సంస్కృతి తగ్గడం మంచి పరిణామం కాదన్నారు. లోక్‌సత్తా అధ్యక్షుడు డాక్టర్ ఎన్ జయప్రకాశ్ నారాయణ్ మాట్లాడుతూ ఆర్థిక సంస్కరణల వల్ల భారత్ రూపురేఖలు మారాయని, కాని ఈ సంస్కరణల్లోని లోపాలను అరికట్టాలన్నారు. టెలికాం రెగ్యులేటరీ అథారిటీ చైర్మన్ జెఎస్ శర్మ మాట్లాడుతూ దేశంలో 700 మిలియన్ల మొబైల్ ఫోన్లు ఉన్నాయని, త్వరలో ఈ సంఖ్య పది బిలియన్లకు చేరుకుంటుందన్నారు. ఆర్థిక స్థితి గాడితప్పకుండా పదునైన విధానాలను అవలంభించాలన్నారు. 2043 నాటికి భారత్ ఆర్థిక స్థితి అమెరికా కంటే పెరుగుతుందన్నారు. ఈ కార్యక్రమానికి పలువురు ఆర్థిక నిపుణులు, చార్టెర్డ్ అకౌంటెంట్లు, కాస్ట్ అకౌంటెంట్లు హాజరయ్యారు.